# 3

# మరణానంతర జీవితపు నిశ్చయత

*"ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడి యున్నాడు" (1 కొరింథీ. 15:20).*

మరణానంతరం ఏమి జరుగుతుందో ప్రదర్శించలేం. కొందరు మృతులలోనుండి లేపబడినా, ఈ జీవితానికి వెలుపల వారి అనుభవాలను గూర్చిన సమాచారము మనకు తెలియదు.

మనలో ఎక్కువమంది జీవించుతునే ఉండగోరతాం. సొలొమోను యిలా అన్నాడు: "ఆయన శాశ్వతకాల జ్ఞానమును నరుల హృదయమందుంచి యున్నాడు గాని దేవుడు చేయు క్రియలను పరిశీలనగా తెలిసికొనుటకు అది చాలదు" (ప్రసంగి 3:11). మరణానంతరం తమ ప్రియులను తిరిగి చూడాలని మనలో ఎక్కువమంది నిరీక్షిస్తుంటారు. సమాధులను దాటిన జీవితం కొరకు మనం నిరీక్షిస్తుంటాం. మరణము మూయబడిన ద్వారముగా మనం ఉండ కోరుకొనము; భావిలోనికి మనం దాటి పోవాలని కోరుకుంటాం.

మరణానంతర జీవితం ఉందని లేక లేదని నమ్మే తాత్వికులు తమ భావాలను తెలుప ప్రయత్నించారు. తర్క శాస్త్రం ఒక్కటిగా వారి తీర్మానాలను నిజమని నిరూపించలేక పోయింది. న్యాయంగా ఉన్నట్టు తోచింది సత్యం కాకపోవచ్చు.

"మరణమైన తరువాత నరులు మరల బ్రతుకుదురా?" అని యోబు అడిగిన ప్రశ్నకు (యోబు 14:14), దైవికమైన బయల్పాటే జవాబు చెప్పగలదు. మరణానంతర జీవితాన్ని గూర్చి తత్వ శాస్త్రంగాని, తర్కశాస్త్రంగాని అనుభవముపై ఆధారపడిన రుజువునో లేక నిశ్చయమైన అభయాన్నో యివ్వలేదు. ఏ లోపములేని బయల్పాటు మాత్రమే ఆ పని చేయగలదు. సమాధిని దాటిన జీవితానికి గల విశ్వాసపు పునాది, అది కట్టుకున్న ప్రత్యక్షత యొక్క స్థిరత్వము మీదనే ఆధారపడియుంటుంది. ఏ లోపములేని ప్రత్యక్షత మనకు లేనట్టయితే, మరణానంతర జీవితాన్ని గూర్చి నిశ్చయమైన ఏ అభయము మనకుండదు.

## పాత నిబంధననుండి అభయము

నిత్య జీవ స్వభావము పాతనిబంధన యొక్క ప్రధాన అక్కర కాకపోయినప్పటికిని, మరణానంతర జీవితానికి సంబంధించిన సూచనలు మాత్రం యివ్వబడ్డాయి. వారు మరల బ్రతుకుతారనడానికి ఇశ్రాయేలీయులు లేఖనాలను శ్రద్ధగా పరిశీలించేవారు.

మరణానంతరం జీవితాన్ని గూర్చి బోధించే లేఖనాలుగా ఈ క్రిందివాటిని వారు గ్రహించారు:

ద్వితీయో. 32:39 – "మృతినొందించువాడను బ్రదికించువాడను నేనే."

కీర్తన. 17:15 – "నేనైతే నీతిగలవాడనై నీ ముఖదర్శనము చేసెదను. నేను మేల్కొనునప్పుడు నీ స్వరూపదర్శనముతో నా ఆశను తీర్చుకొందును."

ప్రసంగి 12:7 – "మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును."

యెషయా 26:19 – "మృతులైన నీవారు బ్రదుకుదురు నావారి శవములు సజీవములగును. మంటిలో పడియున్నవారలారా, మేల్కొని ఉత్సహించుడి. నీ మంచు ప్రకాశమానమైన మంచు భూమి తనలోని ప్రేతలను సజీవులనుగా చేయును."

ఈ ప్రతిపాదనలు మరణానంతర జీవితాన్ని సూచింపవచ్చు, కాని తిరిగి బ్రతికేవారు ఎవరు వారు ఎలా ఉంటారు, వారు ఉండే పరిధి యొక్క స్థితి ఎట్టిదైయుంటుంది – అనే విషయాలు వీటిలో బయలుపరచబడలేదు. వీటిని గూర్చిన సమాచారాన్ని క్రొత్త నిబంధన యిస్తుంది.

మనం తిరిగి జీవిస్తామనే విషయాన్ని పాతనిబంధనలోని యితర లేఖనాలు బోధింపవచ్చు. "నీవు క్షేమముగా నీ పితరులయొద్దకు పోయెదవు మంచి వృద్ధాప్యమందు పాతిపెట్టబడెదవు" అని దేవుడు అబ్రాహాముతో తెలిపాడు (ఆది. 15:15; 25:8; 35:29; 49:33లను కూడా చూడు). "నీ పితరులయొద్దకు పోయెదవు" అంటె, తన పితరులు యింకను బ్రతికియున్నారనే అర్థం కావచ్చు, అయితే అది మరియొక పరిథిలో వారు ఉనికిలో లేకుంటే అతడు వారియొద్దకు ఎలా వెళ్లగలడు?

మృతుల స్థితిని గూర్చి యోబు పలికాడు:

అక్కడ దుర్మార్గులు ఇక శ్రమపరచరు
బలహీనులై అలసినవారు విశ్రాంతి నొందుదురు
బంధింపబడినవారు కార్య నియామకుల శబ్దము వినక
యేకముగా కూడి విశ్రమించుదురు
అల్పులేమి ఘనులేమి అందరు నచ్చటనున్నారు
దాసులు తమ యజమానుల వశమునుండి తప్పించుకొని
స్వతంత్రులై యున్నారు (యోబు 3:17-19).

ఇలా అనడంవలన అతడు మరణానంతర జీవితాన్ని కూడ సూచించాడు:

ఈలాగు నా చర్మము చీకిపోయిన తరువాత శరీరముతో నేను దేవుని చూచెదను. నామట్టుకు నేనే చూచెదను. మరి ఎవరును కాదు నేనే కన్నులార ఆయనను చూచెదను (యోబు 19:26, 27).

తన బిడ్డ మరణాన్ని గూర్చి వేదనపడిన సందర్భంలో, వానియొద్దకు తాను వెళ్లతాననే తలంపునందు దావీదు ఆదరణ పొందాడు (2 సమూ. 12:23). మరణానంతర జీవితాన్ని గూర్చి నమ్మిక దావీదుకు ఉన్నట్టు యిది బయలుపరచుతుంది. తన బిడ్డ యిక ఏ

మాత్రం జీవించియుండకపోతే, వానితోనుండ యితడు ఎలా వెళ్లగలడు? ఒకరి ఆత్మ పాతాళములో విడువబడదన్న సత్యాన్ని గూర్చి దావీదు ప్రవచించాడు (కీర్తన 16:10). ఈ లేఖన భాగం అపొ. 2:25–28లో ప్రభువైన యేసుకు వర్తింపజేయబడింది.

దానియేలు యిలా రాశాడు: "మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు; కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు" (దానియేలు 12:2).

మన ఉనికికి ఈ జీవితమే సమస్తము కాదన్న విషయం ఈ లేఖన భాగాలు సూచిస్తున్నాయి. మనం మరణించిన తరువాత, ఆత్మ లోకంలో ఉంటాం.

## క్రొత్త నిబంధననుండి అభయం

మరణానంతరం జీవితముందని క్రొత్తనిబంధన బోధిస్తుంది. ప్రభువైన యేసు యొక్క బోధలో నిత్య జీవము అనేది ఒక ప్రధానాంశమైయుంది (యోహాను 4:36; 6:54; 10:28; 12:25; 17:2, 3). ఈ చర్చనీయాంశం క్రొత్తనిబంధన అంతటిలో కొనసాగుతుంది (అపొ. 13:48; రోమా 2:7; 1 తిమోతి 6:12).

మరణానంతర జీవితానికి క్రీస్తు పునరుత్థానము ఆధారంగా ఉంది. తన పునరుత్థానంలో ఈ జీవితకాలం తరువాత నిరీక్షణయు (1 కొరింథీ. 15:13–22) మనం తిరిగి బ్రతుకుతామనే అభయమును ఉన్నవి. "పునరుత్థానమును జీవమును నేనే"యని ఆయన తెలిపాడు (యోహాను 11:25); "నేను జీవించుచున్నాను గనుక మీరును జీవింతురు" (యోహాను 14:19). "ఆయన మరణమును నిరర్థకము చేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చును" (2 తిమోతి 1:10).

క్రైస్తవునికి మరణం తరవాత జీవితమనే నమ్మిక తత్వశాస్త్రం మీదగాని, తర్కశాస్త్రం మీదగాని, తాను తిరిగి జీవించాలనే అంతరంగపు ఆపేక్షమీదగాని ఆధారపడి వచ్చింది కాదు. మృతుల పునరుత్థానాన్ని గూర్చి చూపుటకు న్యాయంగా కొన్ని కారణాలను యియ్యవచ్చును గాని, అవి రుజువు కానేరవు. క్రైస్తవ నమ్మికకు పలు సత్యాలు ఆధారంగా నిలిచియున్నాయి.

### దేవుడు విశ్వమునకు సృష్టికర్తయైయున్నాడు

దేవుడే లేకున్నట్టయితే, మరణానంతరం జీవితాన్ని ప్రసాదించగల "శక్తి ఎక్కడను లేదు." సర్వశక్తుడైన దేవుడున్నాడు. ఆయనయే మన మరణానంతరం జీవితాన్ని ప్రసాదించగలడు (అపొ. 26:8).

### యేసు దేవుని కుమారుడైన మెస్సీయాయైయున్నాడు

యేసు తానే మార్గమును, సత్యమును, జీవమునైయున్నాడు (యోహాను 14:6). ఆయన సత్యాన్ని గూర్చి సాక్ష్యమిచ్చుటకు అవతరించినందున, మరణానంతర జీవితాన్ని గూర్చి

ఆయన చెప్పింది సత్యమైయుండి తీరాలి (యోహాను 18:37). ఆయన బోధయందు మనం సత్యాన్ని కనుగొంటాం (యోహాను 8:40); ఆయన శక్తియందు మనం అభయాన్ని లేక నమ్మికను కనుగొంటాం (యోహాను 11:25, 26); ఆయన పునరుత్థానమందు మనం నిరీక్షణ కలిగియుంటాం (1 కొరింథీ. 15:20–22); ఆయన జీవమందు మన జీవాన్ని కనుగొంటాం (యోహాను 14:19).

బైబిలు దేవుని గ్రంథమైయుంది

బైబిలు లేఖకులను దేవుని ఆత్మ నడిపించియున్నాడని సాక్ష్యాధారాలు రుజువు చేస్తాయి (2 తిమోతి 3:16). అంటే, మరణానంతరపు జీవితాన్ని గూర్చిన ప్రతిపాదనయు సత్యమని అర్థం.

*క్రొత్తనిబంధన లేఖకుల సాక్ష్యము సత్యము*

ఏ మినహాయింపూ లేకుండ, క్రీస్తు తిరిగి లేచి తమకు సజీవునిగా కను పరచుకున్నాడని వారందరూ స్థాపించారు. ఒప్పింపబడి తమ సాక్ష్యాలను వారు రక్తముతో రాశారు, అంటే, మరణభయము వారిని ఎదుర్కొన్నప్పుడు సయితం, ఆయన పునరుత్థానాన్ని గూర్చి వారు దృఢముగా సాక్ష్యమిచ్చారు (అపొ. 5:29–31).

దేవుడున్నాడు, బైబిలు దేవుని గ్రంథమైయుంది, క్రొత్తనిబంధన నమ్మదగిన సాక్ష్యాన్ని కలిగియుంది, మరియు యేసు దేవుని కుమారుడైన క్రీస్తయి ఉన్నాడనే అత్యధికమైన సాక్ష్యాధారాల మీద ఆధారపడియుంది. మరణము మన దేహాన్ని దోచుకొనగా మనం చనిపోయినా, మనం బ్రతికేయుంటామనే సాక్ష్యాధారం మీద మన విశ్వాసాన్ని నిలుపుతాం.

## ముగింపు

మరణానంతరపు జీవితం కొరకు మన హృదయాలు పడే ఆరాటానికి దైవ బయల్పాటు వలన అభయమియ్యబడింది, మృతుల లోకంనుండి తిరిగి వచ్చి, నరమాత్రులలో ఎవరును దీన్ని గూర్చి వ్యక్తిగతంగా మనకు సాక్ష్యమియ్యలేదు. మరణానంతర జీవితాన్ని గూర్చిన మన నమ్మిక క్రీస్తు పునరుత్థానము మీదను, దేవుని బయల్పాటు మీదను ఆధారపడియుంది; అందులో ప్రత్యేకించి క్రీస్తుయేసు ద్వారా అనుగ్రహింపబడిన ప్రత్యక్షత మీద ఆధారపడింది. మరణము అనే సంఘటన గుండా మనం దాటి వెళ్లుతున్నప్పుడు, సంపూర్తిగా నిర్మూలపు స్థితిలోనికి మనం నడిచిపోం, జీవంలోనికి వెళ్లతాం.

## పాత క్రొత్త నిబంధనలలో మృతులలోనుండి లేపబడినవారి రికార్డు

| | |
|---|---|
| 1 రాజులు 17:20–23 | సారెపతు విధవరాలి కుమారుని ఏలీయా బ్రదికించాడు. |
| 2 రాజులు 4:32–37 | షూనేమియురాలి కుమారుని ఎలీషా బ్రతికించాడు. |
| 2 రాజులు 13:21 | ఎలీషా సమాధిలో పాతిపెట్టబడిన మోయాబీయుడు ప్రవక్త ఎముకలు తగలగానే తిరిగి ప్రాణంతో బతికాడు. |
| మత్తయి 9:18–25 | సమాజ మందిరపు అధికారియైన యాయీరు కుమార్తె ప్రభువుచే బ్రదికింపబడింది. |
| మత్తయి 27:52, 53 | యేసు మరణ సమయమున పరిశుద్ధులలో అనేకులను దేవుడు లేపాడు. |
| మత్తయి 28:1–9 | యేసు మృతులలోనుండి లేపబడ్డారు. |
| లూకా 7:11–17 | నాయీను విధవరాలి కుమారుని ప్రభువు బ్రదికించాడు. |
| యోహాను 11:23–44 | ప్రభువు లాజరును మృతులలోనుండి లేపారు. |
| అపొ. 9:36–41 | దొర్కా పేతురుచే లేపబడింది. |
| అపొ. 20:9–12 | ఐతుకు పౌలుచే లేపబడ్డాడు. |